# గంజాయి రహిత జిల్లానే ధ్యేయం

- కమ్యూనిటీ ఏరియాల్లో యాంటీ నార్కోటిక్ కమిటీలు
- మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై కఠిన చర్యలు
- ఎస్పీ రాహుల్ హెగ్డే


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, డిసెంబర్ 21 : గంజాయి రహిత జిల్లాగా సూర్యాపేటను నిలిపేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్ రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో కేసుల నమోదు, దర్యాప్తుపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేర దర్యాప్తులో సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. గంజాయి నిర్మూళనలో భాగంగా విద్యా సంస్థలు, కమ్యూనిటీ ఏరియాల్లో యాంటీ నార్కోటిక్ కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇప్పటికే గుర్తించిన గంజాయి రవాణా, వినియోగదారులపై నిఘా కొనసాగించాలన్నారు. పోలీస్ ఫంక్షన్ వర్టికల్ పని విభాగాలు సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై స్టేషన్ హౌజ్ అధికారి స్వయంగా బాధితుడితో మాట్లాడి, ఫిర్యాదులపై వేగంగా స్పందించాలన్నారు. పెట్రోకార్, బ్లూ కోట్స్ సిబ్బంది సేవలను సమర్ధవంతంగా వినియోగించాలని, డీఎస్పీలు, సీఐలు ప్రతి అంశంపై నిరంతర పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు నాగభూషణం, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, మహేశ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, డీసీఆర్‌బీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.


బీఎల్ఓల శిక్షణలో మాట్లాడుతున్న శిక్షణ అధికారి అశోక్‌రెడ్డి

## ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

- డీటీ షాహిన్‌బేగం

నాగారం, డిసెంబర్ 21 : జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండేవారంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని నాగారం మండల డిప్యూటీ తాసీల్దార్ షాహిన్‌బేగం అన్నారు. గురువారం నాగారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లకు మండల ఎన్నికల శిక్షణ అధికారులు కె.అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డిచే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఉప్పలయ్య, ఏఆర్ఐ గోపయ్య పాల్గొన్నారు.


నెమ్మికల్‌లో సంత వేలం నిర్వహిస్తున్న అధికారులు

## నెమ్మికల్ పశువుల సంత వేలం

ఆత్మకూర్.ఎస్, డిసెంబర్ 21 : మండలంలోని నెమ్మికల్ పశువుల సంత వేలం పాటను గురువారం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించారు. వేలంలో 8 మంది పాల్గొన్నట్లు డీఎల్‌పీఓ సాంబిరెడ్డి తెలిపారు. అత్యధికంగా రూ.41,41,516 కు నెమ్మికల్ గ్రామానికే చెందిన బిజిగ సైదులు పాడి సంత వేలం పాటను దక్కించుకున్నట్లు చెప్పారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ.5,05,294 అధికంగా పాడారు. కార్యక్రమంలో ఎంపీఓ సంజీవ, సర్పంచ్ దావీదు, ఎంపీటీసీ ముత్తయ్య, ఉప సర్పంచ్ ఉపేందర్, పంచాయతీ కార్యదర్శులు హరికృష్ణ, శమీ, సుధాకర్, నాగరాజు, సైదులు, ముత్తయ్య పాల్గొన్నారు.

## కొవిడ్ నివారణ చర్యలపై అవగాహన

అర్వపల్లి, డిసెంబర్ 21 : అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొవిడ్, న్యూమోనియా నివారణ చర్యలపై ఎంఎల్‌హెచ్‌ఆర్, ఏఎన్ఎం, ఆశలకు గురువారం డాక్టర్ మణిదీప్ అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో ఆశలు ఇంటింటికి తిరుగుతూ చిన్న పిల్లల్లో వచ్చే నిమోనియాను గుర్తించి ఆ పిల్లలను పీహెచ్‌సీకి పంపించాలన్నారు. కొవిడ్ మళ్లీ ప్రబలుతున్నందున ప్రజలందరూ మాస్క్ ధరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చరణ్ పాల్గొన్నారు.

## తిరుమలకు బయల్దేరిన గోవింద మాలధారులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 21 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోవింద మాల భక్త బృందం ఆధ్వర్యంలో గురువారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం గోవింద మాలధారులు ముడుపులు ధరించి తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి బయల్దేరి వెళ్లారు.

## మద్దిమడుగుకు ఆంజనేయ మాలధారుల పాదయాత్ర

బొడ్రాయిబజార్, డిసెంబర్ 21 : జిల్లా కేంద్రానికి చెందిన 20 మంది ఆంజనేయస్వామి మాలధారులు గురువారం స్థానిక భక్తాంజనేయస్వామి దేవాలయంలో ఇరుముడి స్వీకరించి మద్దిమడుగుకు పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. 12 ఏండ్లుగా మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్నట్లు గురుస్వామి శ్రీనివాస్‌నాయుడు తెలిపారు.

## ఫిజియోథెరపీ శిక్షణ

నూతనకల్, డిసెంబర్ 21 : ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో గురువారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. ఫిజియోథెరపీ డాక్టర్ కృష్ణ ప్రత్యేక అవసరాల పిల్లలకు సెల్‌బ్రల్ పాల్సీ ఎక్స్‌ర్‌సైజ్‌లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 15 మంది దివ్యాంగ విద్యార్థులను పరిశీలించి ఎక్స్‌ర్‌సైజ్‌లను నేర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాములునాయక్, హెచ్ఎం విద్యాసాగర్, ఐఈఆర్పీ అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రశాంత్‌కు నియామక పత్రం అందజేస్తున్న లక్ష్మణ్

## టీ ఎమ్మార్పీఎస్ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడిగా ప్రశాంత్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 21 : ఎమ్మార్పీఎస్ తెలంగాణ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడిగా కనుకు ప్రశాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం నియోజక వర్గ ఇన్‌చార్జి పల్లేటి లక్ష్మణ్ ప్రశాంత్‌కు నియామక పత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడిగా వల్దాస్ మహేందర్, ప్రధాన కార్యదర్శిగా కనుకు రాజేశ్, కోశాధికారిగా పాల్వాయి భరత్, కార్యదర్శులుగా వల్దాస్ వెంకటాద్రి, వల్దాస్ మురళి నియమితులయ్యారు.


పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

## ఐక్య ఉద్యమాలతోనే అభివృద్ధి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హస్సేన్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 21 : ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తూ రాజ్యాంగ హక్కులను సాధించుకోవాలని, ఐకమత్యంతోనే అభివృద్ధి సాధిస్తామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్ అన్నారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు 17వ వర్ధంతి సందర్భంగా గురువారం రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద పి.వి.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును ఎమ్మార్పీఎస్ నాయకులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు గౌరవించాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏడిండ్ల అశోక్, చీఫ్ డిప్యూటీ డిఫెన్స్ లీగల్ ఎయిడ్ మెంబర్ బొల్లెద్దు వెంకటరత్నం, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య, మాల మహానాడు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల ముక్కంటి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నామా వేణు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

## కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఎండగట్టాలి

- నేటి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- వామపక్ష నాయకులు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 21 : ప్రతిపక్ష పార్టీల ఎంపీలను పార్లమెంట్ నుంచి అప్రజాస్వామికంగా సస్పెండ్ చేసిన కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ చర్యలకు నిరసనగా శుక్రవారం దేశ వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, సీపీఐ జిల్లా నాయకుడు బూర వెంకటేశ్వర్లు, సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు పుల్లూరి సింహాద్రి, బహుజన శ్రామిక రాజ్యం రాష్ట్ర కన్వీనర్ చామకూరి నర్సయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రం వైఖరి ఎండగడుతూ ప్రశ్నిస్తున్న 141 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని వామపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పార్లమెంట్‌లో బీజేపీ నిరంకుశంగా వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలుపాలని ప్రజాతంత్ర వాదులు, ప్రజాస్వామ్య శక్తులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు వీరబోయిన రవి, చిన్నపంగ నర్సయ్య, నాయకులు ఎర్ర అఖిల్, శ్రీనివాస్, భరత్, రామోజీ పాల్గొన్నారు.

## నేడు అర్వపల్లి మండల సర్వసభ్య సమావేశం

అర్వపల్లి, డిసెంబర్ 21 : జాజిరెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

- ఎంపీడీఓ ఇందిర

నూతనకల్, డిసెంబర్ 21 : మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎంపీడీఓ ఇందిర అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వీధు ల్లో చెత్త పేరుక పోకుండా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ శశికళ పాల్గొన్నారు.


పెదనెమిలలో సర్వే చేస్తున్న సీఆర్పీ రవీందర్

## బడి బయటి పిల్లల సర్వే

నూతనకల్, డిసెంబర్ 21 : బడి బయట ఉన్న పిల్లల వివరాల సేకరణకు సీఆర్పీ కనకం రవీందర్ మండలంలోని పెదనెమిల గ్రామంలో గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. వచ్చే నెల 14 వరకు సర్వే కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో హాజరు శాతం పెంపుతో పాటు బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా చూసేందుకే సర్వే నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

- ఎంపీడీఓ ఇందిర

నూతనకల్, డిసెంబర్ 21 : మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎంపీడీఓ ఇందిర అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వీధుల్లో చెత్త పేరుక పోకుండా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ శశికళ పాల్గొన్నారు.

## నిత్యాన్నదానం అభినందనీయం

కోదాడ రూరల్, డిసెంబర్ 21 : మాలధారులకు నిత్యాన్నదానం అభినందనీయమని ఎస్వీ విద్యాసంస్థల చైర్మన్ ముత్తినేని సైదేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో సన్నిదానంలో మాలధారులకు గురువారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బర్మావత్ సీతారాంసింగ్, గురుస్వామి రంగారావు, పట్టా నాగరాజు పాల్గొన్నారు.

# సెల్ టవర్ తొలగించాలని ఆందోళన


సెల్ టవర్ తొలగించాలని ఆందోళన చేస్తున్న స్థానిక ప్రజలు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 21 : జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం వెనుక జనావాసాల మధ్య ఉన్న సెల్ టవర్‌ను తొలగించాలని పట్టణంలోని 33, 46వ వార్డు ప్రజలు గురువారం సెల్ టవర్ వద్ద ఆందోళన నిర్వహించారు. పదేండ్లుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని సెల్ టవర్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు పేరాల నర్సింహారావు అన్నారు. సెల్ టవర్ కాల పరిమితి ముగిసినందున గడువు పెంచకుండా టవర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్, సెల్ టవర్ వ్యతిరేక కమిటీ ప్రధాన కార్యదర్శి ఉన్నం సత్యనారాయణ, సభ్యులు బి.నాగేశ్వర్‌రావు, నాగుల వాసు, పిట్టల వెంకటేశ్వర్లు, ఫిరోజ్, రమేశ్, ఆమోస్, వెంకట్‌రెడ్డి, ప్రసాద్, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.